అధికారుల నిర్లక్ష్యం..జీతాలు ఆలస్యం

చాదర్‌ఘాట్‌: అధికారుల నిర్లక్ష్యంతో రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు గత నాలుగు నెలల నుంచి జీతాలు రాక నానా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పలు మార్లు విజ్ఞప్తి చేసినా స్పందన లేదని ఉద్యోగులు వాపోతున్నారు. స్పందించిన వికలాంగుల సహకార సంస్థ జనరల్‌ మేనేజర్‌ ప్రభంజనరావు మాట్లాడుతూ.. ఫైనాన్స్‌ డిపార్ట్‌మెంట్‌లో హెడ్‌ ఆఫ్‌ అకౌంట్‌ నెంబర్‌ తప్పు పడటంతో జీతాలు ఆలస్యమయ్యాయని తెలిపారు. ప్రతిపాదనలు పంపామని త్వరలో జీతాలు విడుదల అవుతాయన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: ప్రతి రోజు యోగా చేయడం ద్వారా ఆరోగ్యకరంగా ఉండొచ్చని, వయస్సుతో సంబంధం లేకుండా యోగా నేర్చుకోవాలని కాంగ్రెస్‌ పార్టీ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్‌ లీడర్‌ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. సరూర్‌నగర్‌ జ్యోతి క్లబ్‌లో శనివారం నిర్వహించిన ఇంటర్‌ స్కూల్‌ యోగా ఆసనాల పోటీల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యోగసనాలు వేయడం అంత సులువు కాదని కానీ.. విద్యార్థులు అలవోకగా వేస్తున్నారని ఇది అభినందించదగ్గ విషయమన్నారు. చదువుతో పాటు వారికి ఆసక్తి ఉన్న రంగంలో రాణించే విధంగా ప్రోత్సహించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.

వరద నీరు ఆగకుండా చర్యలు తీసుకోండి



అభ్యుదయనగర్‌ కమాన్‌ వద్ద అధికారులతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: రోడ్లు, కాలనీల్లో వర్షం నీరు ఆగకుండా తగిన చర్యలు తీసుకోవాలని వనస్థలిపురం కార్పొరేటర్‌ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం కురిసిన వర్షానికి డివిజన్‌ పరిధిలోని అభ్యుదయనగర్‌ కమాన్‌ వద్ద నిలిచిన వరదనీటిని ఆయన జీహెచ్‌ఎంసీ ఏఈలు ప్రజ్ఞ, కార్తీక్‌తో కలిసి పరిశీలించారు. అభ్యుదయనగర్‌ కమాన్‌ వద్ద నీరు నిలుస్తుండటంతో ఎఫ్‌సీఐకాలనీ, జహంగీర్‌నగర్‌, వెంకటరమణ తదితర కాలనీలకు వెళ్లడానికి ఇబ్బందులు తలెత్తుతాయని సంబంధిత అధికారులు స్పందించి వరదనీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్‌ నేతలు

మన్సూరాబాద్‌: ఏకకాలంలో రైతులకు రూ. లక్ష రుణమాఫీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి రైతు బాంధవుడని టీపీసీసీ కార్యదర్శి, కాంగ్రెస్‌ పార్టీ ఎల్‌బీనగర్‌ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రుణమాఫీని హర్షిస్తూ ఎల్‌బీనగర్‌లోని అంబేడ్కర్‌, బాబు జగ్జీవన్‌రామ్‌ విగ్రహాల వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను అమలు పరిచిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ షాకీర్‌, జానీ, షరీఫ్‌, జాల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

‘ఆర్ట్‌ గ్యాలరీ’లో సురభి నాటకాలు



కోరా లక్ష్మిని సత్కరిస్తున్న సురభి వేణుగోపాల్‌రావు

వనస్థలిపురం: నాటక రంగానికి జీవం పోస్తున్న సురభి కళాకారులను ఆదుకోవాల్సిన బాధ్యత కళాభిమానులందరిపై ఉందని ఐఏఎస్‌ అధికారిణి, ఆర్ట్‌ గ్యాలరీ డైరెక్టర్‌ కోరా లక్ష్మి అన్నారు. శనివారం వనస్థలిపురం హుడా ఆడిటోరియంలోని సురభి థియేటర్‌లో శ్రీ వినాయక నాట్యమండలి (సురభి) ప్రదర్శించిన శ్రీనివాస కల్యాణం నాటక ప్రదర్శనకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తమ ఆర్ట్‌ గ్యాలరీ థియేటర్‌లో నెలలో నాలుగు రోజులు సురభి నాటకాలు ప్రదర్శించేలా చొరవ తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సురభి వేణుగోపాల్‌రావు, ఇతర కళాకారులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: అర్హులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్‌ బలాల అన్నారు. శనివారం రాత్రి పంజేషాహలోని కార్యాలయంలో ఫర్హత్‌నగర్‌, కాలాడేరా, చంచల్‌గూడ, ఆజంపుర, వాహేద్‌నగర్‌, ఆఫ్జల్‌నగర్‌, ఓల్డ్‌మలక్‌పేట, మూసారంబాగ్‌, సైదాబాద్‌, అక్బర్‌బాగ్‌, పల్టాన్‌, ఛావుని ప్రాంతాలకు చెందిన 17 మందికి మంజూరైన సీఎం రిలీఫ్‌ ఫండ్‌, చెక్కులు, ఇద్దరికి ఎల్‌ఓసీలు అందజేశారు.

ముసురుకే ముంచెత్తేలా!

చినుకులకే రోడ్లు జలమయం
- పొంగిపొర్లిన డ్రైనేజీలు
- రాకపోకలకు ఇబ్బందులు



జలమయంగా మారిన ఆర్‌కేపురంలోని ప్రధాన రహదారి

దిల్‌సుఖ్‌నగర్‌: రోజంతా ఆగకుండా కురిసిన ముసురుతో ప్రజలు కాస్త ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ప్రధానరోడ్లు జలమయంగా మారి డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. మలక్‌పేట్‌జోన్‌ పరిధిలో కురిసిన ముసురుతో కాలనీలు, బస్తీలు, ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. మలక్‌పేట్‌, చాదర్‌ఘాట్‌, దిల్‌సుఖ్‌నగర్‌ తదితర ప్రాంతాలోని ప్రధాన రోడ్డుపై ట్రాఫిక్‌ స్తంభించింది. దిల్‌సుఖ్‌నగర్‌,మలక్‌పేట్‌, అక్బర్‌బాగ్‌, ఓల్డ్‌మలక్‌పేట్‌, మున్సిపల్‌ కాలనీ, పద్మానగర్‌, కాలడేర, మలక్‌పేట్‌ రైల్వే బ్రిడ్జి, అజంపుర, సైదాబాద్‌, సరూర్‌నగర్‌, ఆర్‌కే పురం, ఐఎస్‌సదన్‌ ప్రాంతాల్లోని లోతట్టు కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నాలాలలో ఎప్పటికప్పుడు పూడిక తీత పనులు చేపట్టక పోవడంతో వరదతో ముంచెత్తుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

- జోన్‌ పరిధిలోని ఎన్‌టీఆర్‌ నగర్‌, అల్కాపురి, భగత్‌సింగ్‌ నగర్‌, ఓల్డ్‌మలక్‌పేట్‌, తీగలగూడ, అక్బర్‌బాగ్‌ తదితర కాలనీలు, బస్తీలలో డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. రోడ్లపై పారుతున్న మురుగు నీటితో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షానికి లోతట్టు కాలనీల వాసులు, మూసీ పరీవాహక ప్రాంతాల ప్రజలు బిక్కుమిక్కుమంటూ గడుపుతున్నారు.

కాలనీలు, బస్తీల్లో నీరు.. పనులు లేక ఇబ్బందులు..



చైతన్యపురి మెట్రో స్టేషన్‌ వద్ద పొంగుతున్న డ్రైనేజీ

ఎల్‌బీనగర్‌: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలెవ్వరూ బయటకు రాదు. అత్యవసరం ఉంటే తప్ప బయటకు రావడానికి ఇష్టపడడం లేదు. దీంతో చిరు వ్యాపారులకు వ్యాపారాలు లేక వెలవెల బోయాయి. రెండు మూడు రోజులు ఇలాగే ఉంటే తెచ్చిన సరుకు పాడయ్యే అవకాశం ఉందని నష్టాలు చవి చూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారంతపు సెలవులు కావడంతో వ్యాపారాలు అధికంగా జరుగుతాయని ముందే ఎక్కువగా వస్తువులుగా తీసుకొచ్చామని ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో ప్రజలు ఎవరూ బయటకు రావడం లేదంటున్నారు. వీరితో పాటు రోజువారి కూలీ పనులకు అడ్డా మీదకు వచ్చె కూలీల స్థితి దారుణంగా ఉంది. పనుల కోసం వర్షంలో ఉదయం నుంచి అడ్డా మీద ఉన్న పనులు లేక ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం వరకు అడ్డా వద్దనే తలదాచుకుని పనుల కోసం వేచి చూసినా ఎవరూ పిలువలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఇంటిబాట పట్టారు.

- ఎల్‌బీనగర్‌లోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగిపొర్లాయి. సంబంధిత అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు. పలు డివిజన్‌లలో కాలనీల్లో అంతర్గత, ప్రధాన రోడ్లలో ఏర్పడిన గుంతల్లో నీరు నిండి ప్రమాదాలకు గురయ్యారు. గుంతలపై గతంలో ఫిర్యాదులు చేసిన పట్టించు కోలేదని ఇప్పటికైనా అధికారులు రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.



కొత్తపేటలో పనుల కోసం ఎదురు చూస్తున్న అడ్డాకూలీలు

వైభవంగా మారుబోనం వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న స్వర్ణలతారెడ్డి, సంగీతారెడ్డి

సైదాబాద్‌: ఆషాఢమాస బోనాల ఉత్సవాలు ప్రారంభించే ముందుగానే అమ్మవారికి మారు బోనాలను వేడుకగా సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని విజయదుర్గామాతా దేవాలయం కమిటీ ప్రతినిధి సునీల్‌రెడ్డి పేర్కొన్నారు. సైదాబాద్‌లో ఆయన ఆధ్వర్యంలో అమ్మవారి మారు బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. సైదాబాద్‌ ప్రధాన రహదారిపై ఉన్న పురాతన హనుమాన్‌ మఠం నుంచి బోనాల ఊరేగింపు మొదలై శివసత్తులు, పోతరాజుల విన్యాసాలు, చిన్నారుల కేరింతలు, యువత నృత్యాలతో ఊరేగింపు సందడిగా సాగింది. రెడ్డిబస్తీ, మూడుగుళ్ల చౌరస్తా నుంచి సాగిన ఊరేగింపు మాతామైదాన్‌లో కొలువుదీరిన విజయదుర్గామాతా ఆలయం వద్దకు చేరుకొని ముగిసింది. ఈ కార్యక్రమంలో సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి, సంగీతారెడ్డి, సుకన్య, సంహితారెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు రవిశంకర్‌, శ్రవణ్‌కుమార్‌ పాల్గొన్నారు.

మూసీ పరీవాహక వాసులు అప్రమత్తంగా ఉండండి

చాదర్‌ఘాట్‌: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మూసీ పరీవాహక ప్రాంతాల వాసులు అప్రమత్తంగా ఉండాలని మలక్‌పేట సర్కిల్‌-6 డీసీ జయంత్‌ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూసీ వెంట ఉన్న కాలనీలు, మూసానగర్‌, కమలానగర్‌, శంకర్‌నగర్‌, పాపయ్యబస్తీ వాసులు వర్షాల నీటి ప్రవాహం చూసి జాగ్రత్త పడాలన్నారు. జీహెచ్‌ఎంసీ, పోలీస్‌ సిబ్బంది తమకు అందుబాటులో ఉంటారన్నారు. అదే విధంగా కాలనీ అధ్యక్షులు, కార్పొరేటర్ల సలహాలు, సూచనలు తీసుకుని జాగ్రత్త వహించాలని తెలిపారు.

హెరాయిన్‌ పట్టివేత

ఇద్దరి అరెస్టు



నిందితులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

చైతన్యపురి: హెరాయిన్‌ విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్‌ చేసిన ఘటన సరూర్‌నగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రాజస్థాన్‌ సిద్దేశ్వర్‌ హరినియాన్‌కు చెందిన రమేష్‌కుమార్‌ (23), మహదేవ్‌రామ్‌ (25), విక్రమ్‌ గోయెల్‌ కొన్నాళ్ల క్రితం నగరానికి వచ్చి ఎర్రగడ్డలో ఉంటూ రాపిడో డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. వీరంతా హెరాయిన్‌ మత్తు మందుకు బానిసయ్యారు. వస్తున్న సంపాదన సరిపోక సులువుగా డబ్బు సంపాదించాలని అత్యాశతో రాజస్థాన్‌కు వెళ్లి అక్కడ నుంచి హెరాయిన్‌ను తీసుకొచ్చి ఎక్కువ మొత్తానికి నగరంలో అవసరమైన వారికి విక్రయించేవారు. గతేడాదిగా రాజస్థాన్‌లో దినేష్‌ కార్తీక్‌ వద్ద నుంచి హెరాయిన్‌ కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎల్‌బీనగర్‌ ఎస్‌ఓటీ, సరూర్‌నగర్‌ పోలీసులు సరూర్‌నగర్‌ ప్రాంతంలో బైక్‌పై వస్తున్న రమేష్‌కుమార్‌, మహదేవ్‌రామ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా హెరాయిన్‌ విక్రయిస్తున్నట్లు ఒప్పుకోవడంతో అరెస్టు చేశారు. ఇదే కేసులో విక్రమ్‌ గోయల్‌, దినేష్‌ కల్యాణ్‌ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్‌: సరూర్‌నగర్‌/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు.. టమోటా రూ.51, వంకాయ రూ.23, బెండ రూ.28, పచ్చిమిర్చి రూ.50, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.23, కాలిఫ్లవర్‌ రూ.28, క్యాబేజీ రూ.26, క్యారెట్‌ రూ.28, దొండ రూ.23, ఆలుగడ్డ రూ.38, ఉల్లిగడ్డ రూ.39, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.15, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.13, అరటికాయ రూ.10, చిక్కుడు కాయ రూ.65, అర్వి రూ.35, మునగ రూ.65, చిలుకడ దుంప రూ.50, బీట్‌రూట్‌ రూ.23, కీర రూ.18, బీన్స్‌ రూ.45, క్యాప్సికమ్‌ రూ.50. ఈ ఆదివారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

గురుపూర్ణిమ ఉత్సవాలు ప్రారంభం



చైతన్యపురి: దక్షిణ షిరిడీగా ప్రసిద్ధి చెందిన దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో మూడ్రోజుల పాటు వైభవంగా నిర్వహించే గురుపూర్ణమి మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్‌ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్‌ వి. శ్యామ్‌కుమార్‌ తెలిపారు. ఉదయం 6 గంటలకు భూపాలి, కాకడహారతి, సాయిబాబాకు మంగళస్నానంతో ప్రారంభమయ్యాయన్నారు. 9 గంటలకు శ్రీసాయి లక్ష పుష్పార్చన, 10 గంటలకు శ్రీగురుపాదుకా పూజ కార్యక్రమం, 12 గంటలకు అఖండ హారతి నిర్వహించటం జరగిందన్నారు. పూజల్లో ఆలయ ట్రస్ట్‌ ప్రధాన కార్యదర్శి రఘుకుమార్‌, మాజీ చైర్మన్‌ గుండమల్లయ్య దంపతులు, వనం యాదయ్య, బచ్చు గంగాధర్‌, కిరణ్‌ రాజశేఖర్‌, ఆర్‌ఎస్‌ శంకర్‌రావు, పద్మారావు ఆత్రే పాల్గొన్నారు.

నేడు గురుపూర్ణిమ వేడుకలు

నాగోలు: జైపురికాలనీలోని షిరిడీ సాయిబాబా దేవాలయంలో ఆదివారం గురుపూర్ణిమ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ చైర్మన్‌ కొలన్‌ వెంకట్‌రెడ్డి, సెక్రటరీ జంగయ్య గుప్తా ట్రెజరర్‌ రావుల రంజిత్‌గౌడ్‌ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆలయంలో కాగడ హారతి, శ్రీగణపతి పూజ, దత్తాత్రేయస్వామి అభిషేకం, అర్చన, సాయిబాబా స్వామి వారి మూలవిరాట్‌కి పంచామృతములతో అభిషేకం, మధ్యాహ్న హారతి, సంధ్యాహారతి, పల్లకి సేవ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ప్రశాంత్‌నగర్‌లో..

వనస్థలిపురం: వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లోని షిరిడీ సాయిబాబా సంస్థాన్‌లో గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 4.45కు కాకడహారతి, 5.30కు గణపతిపూజ, 6 గంటలకు మూలవిరాట్‌కు శతఘటాభిషేకం, విశేష అలంకరణ, 7 గంటలకు దత్తహోమం, 7.45కు విష్ణు సహస్రనామ పారాయణం, 8 గంటలకు సంస్థాన్‌ హారతి, తీర్థ ప్రసాద వితరణ, 9 గంటల నుంచి సామూహిక సాయి సత్యవ్రతం, మధ్యాహ్నం 12 గంటలకు హారతి, అన్నిస్థాయిల్లోనూ సాయంత్రం 6.15 గంటలకు సంధ్యా హారతి, రాత్రి 7 గంటలకు పల్లకిసేవ, 9 గంటలకు శేజ్‌ హారతి తదితర పూజాది కార్యక్రమాలు ఉంటాయన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు



బ్రోచర్లను విడుదల చేసిన సుభాష్‌చందర్జీ

సైదాబాద్‌: బోనాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలని శ్రద్ధాబాద్‌ మార్కెట్‌ అసోషియేషన్‌ చైర్మన్‌ సుభాష్‌చందర్జీ అన్నారు. సైదాబాద్‌లో శ్రద్ధాబాద్‌ మార్కెట్‌ అసోషియేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 46వ సంవత్సర మహంకాళి జాతర మహోత్సవం బ్రోచర్లను శనివారం ఆయన అసోషియేషన్‌ సభ్యులతో కలిసి విడుదల చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహంకాళి జాతర ప్రతీ ఒక్కరిలో భక్తి, మహోత్తరమైన శక్తిని కలిగిస్తుందన్నారు. శ్రద్ధాబాద్‌ మహంకాళి జాతర ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 28న అమ్మవారికి బోనాలు, 29న ఘటాల ఊరేగింపు, 30న సైదాబాద్‌ మార్కెట్‌లో అన్నదానం నిర్వహిస్తామన్నారు. మార్కెట్‌ కూడలి వద్ద గావు పట్టే కార్యక్రమం నిర్వహించి అనంతరం దోభీఘాట్‌ వద్ద ఘటాల నిమజ్జనంతో వేడుకలు ముగుస్తాయనర్నారు.

నూతన కార్యవర్గం

శ్రద్ధాబాద్‌ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌గా సుభాష్‌ చందర్జీ, అధ్యక్షుడిగా మల్లేష్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌గా కదారి రామ్‌కుమార్‌, ఉపాధ్యక్షులుగా సహదేవ్‌యాదవ్‌, సంగోధి పరమేశ్‌కుమార్‌, గౌలీకర్‌ దినేష్‌, ప్రధానకార్యదర్శిగా శ్రీనివాస్‌ చందర్జీ, కోశాధికారిగా గౌలీకర్‌ పూర్ణచందర్‌, కార్యదర్శులుగా కోళ్ల గోపి, ఆశీష్‌ గౌలీకర్‌ నియమితులయ్యారు.

బీపీ నిర్ధారణ పరీక్షలపై అవగాహన

మీర్‌పేట: మీర్‌పేట నందిహిల్స్‌లోని శ్రీవిద్య పాఠశాలలో శనివారం 9, 10వ తరగతి విద్యార్థులతో రక్తపరీక్షలు, బీపీ నిర్ధారణ పరీక్షలను చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు సీహెచ్‌.వెంకటేశ్వర్లు, మహేశ్‌లు మాట్లాడుతూ.. బయోలాజీ సబ్జెక్టులోని ఓ పాఠ్యాంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించడంలో భాగంగా ల్యాబ్‌లో జరిగే కార్యకలాపాలపై స్వయంగా తెలియజేసేలా ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఇతర తరగతుల విద్యార్థులకు పరీక్షలు చేసి బ్లడ్‌ గ్రూప్‌లను ఎలా కనుక్కోవాలో వివరించినట్లు తెలిపారు.

సైబర్‌ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఎల్‌బీనగర్‌ ఏసీపీ కృష్ణయ్య



నాగోలు: సైబర్‌ నేరాలు పట్ల వ్యాపారస్తులు అప్రమత్తంగా ఉండాలని ఎల్‌బీ నగర్‌ ఏసీపీ కృష్ణయ్య సూచించారు. శనివారం నాగోలు డివిజన్‌లోని శుభం కన్వెన్షన్‌ హాల్లో మార్బుల్‌, గ్రానైట్‌ వ్యాపారస్తులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గురు పూర్ణిమ ప్రసాద పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. రోజురోజుకు సైబర్‌ నేరాలు పెరిగిపోతున్నాయని ఫోన్లలో గుర్తింపు లేని యాప్‌లను డౌన్‌లౌడ్‌ చేసుకోరాదని గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పరాదన్నారు. మాదకద్రవ్యాలకు చిన్న వయసులోనే అలవాటు పడి యువత పెడదారిన పడుతుందని తల్లిదండ్రులు వారిపై నిఘా పెట్టాలన్నారు. ఎక్కడైనా డ్రగ్స్‌ క్రయ విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌ యాదవ్‌, నాగోలు సీఐ సుధీర్‌కృష్ణ, ఎస్సై శివ నాగ ప్రసాద్‌ పాల్గొన్నారు.

రజతోత్సవాలను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీచారి

మన్సూరాబాద్‌: శ్రీవైష్ణవి సేవా సంఘం, తెలంగాణ ఆవిర్భవించి 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం మన్నెగూడలోని బీఎంఆర్‌ సార్థ కన్వెన్షన్‌ సెంటర్‌లో నిర్వహించనున్న రజతోత్సవాలు జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శృంగారం తిరువేంగళాచార్యులు (ఎస్టీచారి) తెలిపారు. మన్సూరాబాద్‌ చంద్రపురికాలనీలోని శ్రీవైష్ణవ సదనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిటైర్డ్‌ ఐఏఎస్‌ డాక్టర్‌ కేవీ రమణాచార్యులు, మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాలాచార్యుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఉత్సవాలకు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి ప్రారంభిస్తారన్నారు. 10వ తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన శ్రీవైష్ణవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు పారితోషికాలు, వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన విశిష్ట పండితులకు సన్మాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. శ్రీవైష్ణవుల సమస్యలపై ప్రభుత్వానికి నివేదించేందుకు పలు తీర్మానాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కండకుంట్ల యాదగిరాచార్యులు, చిలుకమర్రి లక్ష్మినాథాచార్యులు, బీఎస్‌చారి, రత్నమాచారి, ఆచార్య వేణు, సంఘం ప్రధాన కార్యదర్శి సేనాపతి మోహన్‌, బద్రీనాథ్‌, రత్నకుమార్‌, రమాదేవి, మాధవి, శ్రావణి పాల్గొన్నారు.

బడిబాటకు విశేష స్పందన



మాట్లాడుతున్న హెచ్‌ఎం బత్తుల శ్రీనివాస్‌

నాగోలు: ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రులు నమ్మకముంచాలని నాగోలు డివిజన్‌ జైపురికాలనీ మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బత్తుల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నాగోల్‌ డివిజన్‌ పరిధిలోని జైపురి కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రులు ఉపాధ్యాయుల (పీటీఎం) సమావేశం ప్రధానోపాధ్యాయులు బత్తుల శ్రీనివాస్‌ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌ పర్సన్‌ వరలక్ష్మి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల వసతులు సౌకర్యాలు ఏర్పాటు చేస్తుందని పేద విద్యార్థులకు చదువుతో పాటు అన్ని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా నిర్వహిస్తుందని వాటిని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బత్తుల శ్రీనివాస్‌ రెడ్డి మాట్లాడుతూ.. బడి బాట కార్యక్రమానికి స్పందన వచ్చిందన్నారు. పాఠశాలకు ఇప్పుడున్న విద్యార్థులకు సరిపడ తరగతికి ఒక ఉపాధ్యాయుడు కావాలని ప్రభుత్వం అందించే వరకు దాతలు ప్రజాప్రతినిధులు సహకారంతో ఇద్దరు వలంటీర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అనంత రెడ్డి ,మేరీ బ్యూల సుధారాణి, అంగన్వాడీ టీచర్లు లలిత, పాఠశాల మాజీ చైర్మన్‌ చందన పాల్గొన్నారు.

‘అంగన్‌వాడీ’లో అక్షరాభ్యాసం

నాగోలు: డివిజన్‌ పరిధిలోని జైపురికాలనీ బ్లెండ్స్‌ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. జైపురికాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు లలిత, మేఘమాల ఆధ్వర్యంలో విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించి చదువుపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహారంపై విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి చిన్నారులకు తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. పాఠశాల విద్యా కమిటీ సభ్యులు వరలక్ష్మి, ఉమాదేవి, రేణుక, ప్రభ, భరత్‌, మానిక పాల్గొన్నారు.

జహీరాబాద్‌ కోహినూర్‌ అల్లానికి మద్దతు ధర

చాదర్‌ఘాట్‌: ప్రభుత్వ ఆదేశాల మేరకు జహీరాబాద్‌లో కోహినూరు అల్లం పండించే రైతులకు మద్దతు ధర ఇప్పించాలని ప్రభుత్వ ఆదేశాలు ఇవ్వడంతో శనివారం మలక్‌పేటలోని వ్యవసాయ మార్కెట్‌ కార్యాలయంలో ఉస్మాన్‌గంజ్‌ వాపారస్తులతో అదనపు సంచాలకులు రవికుమార్‌ ఆధ్వర్యంలో చర్చలు జరిగాయి. అనంతరం రవికుమార్‌ మాట్లాడుతూ.. కేరళ రాష్ట్రంలో పండించే కోహినూర్‌ అల్లానికి ఏ విధంగా అయితే మద్దతు ధర వస్తుందో అదే విధంగా జహీరాబాద్‌ కోహినూరు అల్లానికి కూడా మద్దతు ధర ఇవ్వాలని వ్యాపారస్తులకు సూచించారు. ఈ సమావేవంలో హైదరాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌ ఎస్‌జీఎస్‌ దామోదర్‌, అధికారులు పుష్ప, మాధురి పాల్గొన్నారు.

కళాశాల యాజమాన్యం వేధింపులతో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

దిల్‌సుఖ్‌నగర్‌: కళాశాల యాజమాన్యం వేధింపులు భరించలేక ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన చైతన్యపురి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. నాగర్‌ కర్నూల్‌ జిల్లా, అచ్చంపేట మండలం, చేదురుబావి తండాకు చెందిన వేణుశ్రీ హరిపురికాలనీలోని శ్రీ చైతన్య కాలేజీలో ఇంటర్‌ సెకండ్‌ ఇయర్‌ చదువుతుంది. శనివారం తన హాస్టల్‌ గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన తోటి స్నేహితులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కళాశాల యాజమాన్యం వేధింపులతోనే తమ కూతురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తల్లిదండ్రులు పేర్కొన్నారు.